# 3

## అత్తగారూ - ఓటూ

మధ్యాహ్నం మావాడు వాడి 'ఫ్రెండ్స్‌ని' చాలామందిని భోజనానికి పిలిచి విందుచేశాడు. ఆ విందు భోజనం యింట్లో అందరితోబాటు నేనూ ఆరగించాను, నలభై దాటిం తర్వాత తినాలనే ఆశేగాని అరిగించుకుండే శక్తి ఎక్కణ్ణించి వస్తుందీ! కడుపులో సంకటం ప్రారంభమైంది....బాధ పడుతూ కూర్చున్నా....

'యిలాంటప్పుడు వో సోడా తాగితే టక్కున సరి పోతుందండీ!' అన్నాడు మా మేనేజరు.

ఆయన స్వానుభవంతో కూడిన సలహా అది. మా మేనేజరు తింటానికే పుట్టిన మహాకాయుడు...తిండి ఎక్కు వయి కడుపులో బాగా లేకపోతే అరగించే ఉపాయం కని పెట్టాలేగాని, తిండి మానకూడదనే 'థియరీ' ఆయనది. తన కడుపులో ఏమాత్రం సంకటంగావున్నా, తక్షణం రెండు సోడాలు తెప్పించేవాడు మా మేనేజరు...(ఆయనకు డబుల్ డోసు కావాల్లెండి, భోజనం దగ్గర్నుంచి మందుదాకా) రెండు పెద్ద గ్లాసుల్లో నాలుగు నిమ్మపండ్లు పిండి, రెండు చెంచాలు ఉప్పువేసి, షోడాలు రెండూ కొట్టి ఆ గ్లాసుల్లో

పోసేవాడు. . .తక్షణం సున్నపుబట్టీలాగా బుస్సుమని పొంగే ఆ రెండు గ్లాసులూ ఎత్తి గటగట గట తాగేసేవాడు... ఆ దెబ్బతో యాభై తేనుపులు రావడం, అరగంట తిరక్కుండానే ఆయన కడుపులో ఆకలి మిషను చకచకచకస్పీడుగా పనిచెయ్యడం, రెపరెప ఆకలి పుట్టుకురావడం, ఆవురావురు మంటూ ఆయన వెళ్ళి అమాంతం అన్నంమీద విరుచుకుపట్టం జరుగుతూ వుంటాయి. అది ఆయన అజీర్ణ నిర్మూలనసాధన. . .ఆయన తయారుచేసే ఆ సోడాల ప్రిపరేషన్ పేరు అహి, మహి, రావణాక్రష్‌లని పేరు పెట్టాం...

ఒకసారి మా అత్తగారికి కడుపులో కాస్త సంకటంగా వుందంటే ఆ రావణాక్రష్ యిచ్చాడు మా మేనేజరు. . . పాపం మూడురోజులదాకా విరోచనాలు పట్టుకుని కడుపు దొక్కుపోయి చచ్చి బ్రతికింది. . .ఆ దెబ్బతో మా అత్తగారికి ఆ క్రష్ పేరు చెప్తే ఒళ్ళుమంట. . .అందుకే అప్పట్నుంచి భయపడి మేనేజరు మా కెవరికీ ఆ క్రష్ తాగమని చెప్పడు. . .ఒట్టి సోడా తాగండి అన్నాడు.

వో సోడా తీసుకురమ్మని పని పిల్లవాడిని పంపాను కొంచెం సేపయ్యాక వాడు ఒట్టి చేతుల్తో తిరిగొచ్చాడు—

'సోడా ఏదిరా !'

'లేదమ్మా. . .ఈ రోడ్డులోవున్న అంగళ్ళన్నీ వెతికాను. . .సోడాల్లేవు. . .'

'ఏమైనాయిరా? ఈ రోడ్డంతా సోడా కొట్లేగా. . .'

'అవునమ్మా, మొన్నటిదాకా వుండేయి. . .ఎలక్షన్లు గదమ్మా! రెండుపార్టీలవాళ్ళు మీటింగుల్లో ఎక్కడబడితే

అక్కడా సోడాబుడ్లు ఒకరిమీ దొకరు యిసిరి కొట్టు కున్నారు. ..దాంతో వూర్లో వుండే సోడాబుడ్లన్నీ ఎగిరి పొయ్యాయంట' అని పని పిల్లవాడు చెప్తూంటే యిలాంటి పరిస్థితుల్లో దేశానికి ఏంగతి పడ్తుందోననే గాభరాతో కడుపులో నొప్పి మరి కాస్త ఎక్కువైంది.

'ఏమిటమ్మా, కడుపు నొక్కుకుంటున్నారూ ?... కడుపులో బాగోలేదా ?' అంటూ మా వాడికి చిన్నప్పుడు ట్యూషన్ చెప్పిన మాస్టరుగారి భార్య శాంతమ్మ వచ్చింది.

'లేదండీ! మధ్యాన్నం కొంచెం విందు భోజనం తగిలింది. ..అరుగుడు పడలేదు...'

అయితే వెంటనే వో సోడా తాగేసెయ్యండి!... చప్పున తగ్గుతుందీ!...

'ఎక్కడండీ! ఏ కొట్లోనూ సోడా దొరకలేదు...'

'ఏం! ఎందుకనీ '—

'ఎలక్షన్లు గదండీ!—రెండు పార్టీల వాళ్ళకూ సోడాలే ఆయుధాలైనాయిట...'

'ఓహో! అదా? అవునండీ! ఈ రోజు ప్రొద్దుట మా యింటిదగ్గర రెండు పార్టీలవాళ్ళూ సోడాబుడ్లు విసిరి కొట్టుకోగా చాలామందికి గాయాలు తగిలాయిట. ఒకరిద్దరి పరిస్థితి ప్రమాదకరంగా వుందట, హాస్పిటల్లో చెప్పు కుంటున్నారు-

'మరింకేం! యిన్నిచోట్ల సోడాబుడ్లు ఎగిరిపోతుంటే తాగడాని కెట్లా దొరుకుతాయి?...అని నే నంటూండగా మా బావగారొచ్చారు...

'ఏమిటమ్మా. అలా కూర్చున్నావూ? కడుపు నొప్పా?—' అని అడిగారు.

'అవునండి...మధ్యాన్నం తిన్న తిండి అరగలేదు..'

'అయితే, వెంటనే వో సోడా తాగేస్తే తగ్గిపోతుందే!'

నాకు నవ్వొచ్చింది—

'అదే మాట్లాడుతున్నాం.. ఎక్కడా సోడాలు దొరకలా—ఈ రోడ్డంతా వెతికినా.. ఎలక్షన్లుగదూ, రెండు పార్టీలవాళ్ళూ—'

'ఆ!....అవునవును....అన్నట్లు ప్రొద్దుట నేను వస్తుంటే రెండు పార్టీల వాళ్ళకు మాటా మాటా వచ్చి బస్సులు ఆపి, భయంకరంగా పోట్లాడుకోవడమే గాక, ప్రక్కనున్న అంగళ్ళలోంచి సోడాబుడ్లు తెచ్చికొట్టుకోడం నా కళ్ళారా చూశాను...నాకు గాభరా పుట్టుకొచ్చి నా మీద ఆ పెంకులు ఎక్కడ పడతాయోనని వెనక్కి పరిగెత్తికెళ్ళి ఎలక్ట్రిక్ ట్రెయిను పట్టుకొని ఆటోరిక్షాలో అరగంట లేటుగా ఆఫీసుకొచ్చా...ఎమిటో దేశం యీ స్థితిలో వుంది.. ఎట్లా వుంటుందో ముందు ముందు, ఆ భగవంతుడికే తెలుసు...పోనీ కాస్త వాము తినమ్మా! నాటువైద్యమైనా పనిచేస్తుంది వెంటనే...అనిచెప్పి వెళ్ళారు మా బావగారు... ఆయనటు వెళ్ళగానే మా అన్నకూతురూ, దాని భర్తా పిల్లలూ వచ్చారు.

'ఏమే వోటు వేశారా?' అని అడిగాను వాళ్ళను చూస్తూనే—

'అయ్యో! మాకు వోట్లూ లేవు, పాట్లూ లేవు... మేము డీ. ఎం. కె. కి వేస్తామని మొదటి పార్టీ వాళ్ళు పసికట్టారుట.... మా పేర్లు కొాటేశారు....'

'అరెరె! అదెట్లా జరుగుతుంది!....మీరడగలా?'

'ఇంక అడిగేదేముంది!....మా పంచాయతీబోర్డు ప్రెసిడెంట్ కాంగ్రెసుపార్టీ...మేముండే చోటంతా డీ. ఎం. కె. వోట్లే ఎక్కువ పడతాయి. తెలిసేచేశారు...యిక వాళ్ళతో ఎవరు పేచీ పెట్టుకుంటారని పలక్కుండా వూరుకున్నాం...' అంటూ వాళ్ళ పిల్లల్ని తీసుకుని పక్కనున్న స్టూడియోలో షూటింగ్ చూసివస్తామని వెళ్ళారు.

'అయ్యో, యీ విధంగా చాలాచోట్ల జరిగిందమ్మా! వీళ్ళ కెక్కువ వోట్లొస్తాయని వాళ్ళూ, వాళ్ళ కెక్కువ వస్తాయేమోనని వీళ్ళూ అనవసరంగా అనుమానించి మా పేటలో చాలామందికి వోట్లు లేకుండా చేశారు. అన్నట్లు మీ అత్తగారు వోటు వేశారా?' అని అడిగింది శాంతమ్మ.

'ఆ వేశారు...కాని ఎవరికి వేశారో చెప్పనంటున్నారు...'

'ఏమిటీ! మీగ్గూడా చెప్పలేదా?...

'లేదండీ!...' అన్నాను.

'ఏదీ ఆమె కనిపించరేం!'

'యిప్పుడే వో కునుకు తీసి లేచి పెరటి వేపు వెళ్ళారు. మా ఆవు దూడను వేసిందిగా మొన్న! దాన్ని పలికరించి ముద్దులాడిగాని రారు...

'హోహో! ఏ ఆవు వేసిందండీ? మీనాక్షా, కామాక్షా?'

'కామాక్షీ....'

'ఇది రెండో ఈతను కుంటాను?'

'అవునండీ!....దాని మొదటి ఈత సంతానం పేరు గణపతి....ఈసారి పెయ్యా దూడను వేసింది....మా అత్త గారు ఇప్పుడు పుట్టిందానికి రెండుమూడు పేర్లు సెలక్ట్‌చేసి వుంచారు. ఒకటి చాముండేశ్వరి, రెండు అఖిలాండేశ్వరి. మూడు భువనేశ్వరి....ఏదైనా పెట్టొచ్చు మంచిరోజు చూసి....'

'మీనాక్షికి ఎన్నితలైంది!' -

'రెండు - రెండూ పెయ్యదూడలే....మొదటిదాని పేరు బాలా త్రిపురసుందరి....రెండోదాని పేరు ఆదిలక్ష్మి....

శాంతమ్మగారు విరగబడి నవ్వారు.

'ఎంత పుణ్యాత్ములమ్మా మీరు!....వాటన్నిటినీ పిలిచేటప్పుడు ఎంతో దైవస్మరణ జరుగుతుంటుంది....యిక వేరే పూజలే అక్కర్లేదు! అన్నట్లు గేదె వున్నట్లుందే - దాని పేరేమిటో?'....

'దుర్గ! దాని పెయ్యదూడపేరు స్వర్ణగౌరి....అది స్వర్ణగౌరీ వ్రతంరోజు పుట్టింది, అందుకని ఆ పేరు పెట్టారామె' -

'అబ్బ! ఆమెకు గొడ్ల పేర్ల విషయంలో కూడా ఎన్ని పట్టింపులు! ఎంత శ్రద్ధ! మనుషుల పేర్లుక్కూడా యింత బాధపడం - యింతకీ ఆమెవోటు ఎవరికి వేసిం దంటారూ?'-

'ఏమోనండీ! ఆ విషయం మాత్రం చెప్పనంటున్నారామె!....ఎంతో అడిగారు వాళ్ళబ్బాయీ, మనవడూకూడా.

చెప్పలా....మీ కెందుకురా! ఎవరికో వొకరికి వేశాన్లే.... నేనెందుకు చెప్పాల? మీవోటు రహస్యంగా వుంచండి అని మన పంచాయతీబోర్డు ప్రెసిడెంటు మరీ మరీ చెప్పిపో యాడు....తప్పుగదూ చెప్తే!....అన్నారు ...

'అబ్బో అబ్బో! పెద్దావిడె బలే ఏడి పిస్తోందే అం దర్నీ!....అయితే ఆవిడి కిష్టమైంది ఆవూ దూడేగా - దాని కేసిందేమో వోటు మరి'....

'అబ్బే... నేనూ మొదట అలాగె అనుకున్నాను. కాని ఆమెకి రాట్నం అంటే చాలా చాలా యిష్టం....మా యింట్లో ఆమె చిన్నప్పుడు ఒడికిన రాట్నం అటకమీ దుంది. దానికి ప్రతి శుక్రవారం నాచేత పసుపు కుంకుమలు పెట్టించి ఎంతో భక్తితో నమస్కారిస్తారు. అదే దేశానికి రక్ష అంటూంటా రామె....ఆ రోజు వోటు కాగితంమీద రాట్నం బొమ్మ చూసి ఆమెముఖం చాటంతయింది.

'అట్లాగా!....అయితే రాట్నాని కేసిం దేమో'....

'అబ్బే!....మళ్ళీ అక్కడా దెబ్బతిన్నాం....ప్రతి రోజూ సూర్య నమస్కారాలు చేస్తూ ఆదిత్య హృదయం చదువుతారుగా ఆమె!....సూర్యనారాయణ మూర్తి ప్రత్యక్ష దైవం అంటుదిం....వోటు కాగితంమీదున్న డి. ఎమ్. కె. సూర్యుడి బొమ్మ చూసి దానికి నమస్కారం చేసింది'....

'ఓహో! అయితే డి. ఎమ్. కె. కి వేసుంటా రావిడె—'

'అబ్బే, అట్లా అనుకోడానికీ లేదే! - వోటు కాగితం మీదే ఆవూదూడను చూసినప్పుడు ఎంత మురిసిపోయారూ

ఆమె! మన మీనాక్షి, లక్ష్మిలాగా వున్నాయి కదే బొమ్మలో ఈ అవూదూడా? - అని నాతో అంటూ ఆ బొమ్మను అప్యాయంగా చేత్తో తడిమారు.'

'అట్లాగా!....అయితే పెద్ద సమస్యే అయిందే!.... ఆవిడ వోటు కాగితంమీద ముద్ర వేయడం మీరు చూళ్ళేదా?-'

'లేదండీ. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళం వెళ్ళి వేశాం - ఆవిడికి వోటు కాగితాలు యిచ్చి మీయిష్టం అయిందానిమీద వేసి మడిచిపెట్టి ఈ పెట్టెలో వేయండి అని చెప్పారు - ఆమె లోపలకు వెళ్ళి కొంచెం సేపయ్యాక బయటి కొచ్చారు- వోటు కాగితం మడత పెడుతూ. బల్లదగ్గరున్నవాళ్ళు ముందున్న పెట్టెలో వేయమన్నారు. ఆ పెట్టె చెయతాక కుండా మడిగా ఎత్తి పడేశారు....వాళ్ళు పుల్లతో కాగితాలు పెట్టెలోకి తోశారు....తర్వాత నేను వేసొచ్చాను....'

'అదుగో! వస్తున్నారు....నే నడుగుతా నుండండి' అన్నది శాంతమ్మ.

'అడిగి చూడండి....మీకైనా చెప్తారేమో చూద్దాం..' అన్నాను.

మా అత్తగారు శాంతమ్మను చూసి 'వోహో శాంతమ్మ! ఎంత సేపైంది ఒచ్చి? చాలా రోజులైందే కనిపించి!.... మీ వారూ పిల్లలూ బాగున్నారా!....' అంటూ నావైపు తిరిగి "ఏమే! సోడా తాగావా? కడుపునొప్పి ఎట్లావుందిప్పుడూ?" అన్నారు.

'అలాగేవుంది....యింకా సోడా తాగలా'

'ఏం! ఎందుకు తాగలేదూ!'

ఇంతలోకే శాంతమ్మ అందుకున్నది -

'సోడాలు దొరక లేదటండీ!.... ఈ ఎలక్షన్ల గొడవలో రెండుపార్టీలవాళ్ళూ కొట్టుకోటాల్లో సోడాబుడ్లు వేలకివేలు పగిలిపోయాయి....అందుకని ఈ రోడ్డులోఒక్క అంగట్లోనూ సోడా ల్లేవుట....'

'హోరి వీళ్ళ అఘాయిత్యాలు మండిపోనూ!.... ఎవళ్ళకే బొమ్మలిష్టమో ఆ బొమ్మలకు వోట్లు వేసుకుంటారు - దానికి కొట్టుకోడాలూ, పొడుచుకోడాలూ ఎందుకూ?....ఇంక ఈకాడికి వోట్లూ పాడూ ఎందుకూ? పూర్వం రాజుల్లాగా ఎవడు బలవంతుడైతే వాడే మిగతావాళ్ళని చావకొట్టి రాజ్యం నాది అని ఆక్రమించి ఏలుకోవచ్చుగా!....ఆనాడు బ్రహ్మంగారు చెప్పిందంతా అక్షరాలా జరుగుతూందమ్మా....

'బాగా చెప్పారు ...అన్నట్లు మీ రెవరి కేశారు వోటు?' అని అడిగింది శాంతమ్మ....మా అత్తగారు ముసిముసినవ్వులు నవ్వుతూ 'నేనెవళ్ళకేస్తే ఏమిట్లే ముసలిదాన్ని- నా వోటు ఏవరిక్కావాలి? నువ్వూ మీ ఆయనా ఎవరికేశారు? అది చెప్పు.

అదేమి టండోయ్! ముసలివాళ్ళ వోటుకే చాలా విలువ యిప్పుడు....ఎవరో నూట ఇరవై ఏళ్ళ ఆవిడ వోటు వేసిందిట...ఈసారి మూలనున్న ముసలివాళ్ళంతా, ఎన్నడూ వోటువేయనివాళ్ళంతా వచ్చి వేస్తున్నారు... మీరు వెయ్యడం అందరికీ ఎంతో ఉత్సాహాన్ని కలిగించి వుంటుంది....'

'ఆఁ, ఏం ఉత్సాహమో లెండి.... ఈవారం రోజులుగా ఈ ప్రాంతాన ఎన్ని కొట్లాటలు జరిగాయో ఒక్కొక్కటీ మా పనిమనిషి చెప్తూంటే, నా ఘటం వుండగానే యింత అరాజకం ఏర్పడుతుందని అనుకోలా ... బ్రహ్మంగారు కాల జ్ఞానంలో వ్రాసిన వన్నీ జరుగుతూనే వున్నాయి.... యింకా ఏం జరుగుతాయో! ప్రపంచం అంతా అల్లకల్లోలంగా వుంది, ఏది విన్నాగూడా....' అంటూ తమ వోటు ఎవరికి వేసింది చెప్పకుండా సంభాషణ వేరే గొడవల్లోకి తిప్పారు మా అత్త గారు.... శాంతమ్మ పెద్దావిడ తెలివితేటలకి ఆశ్చర్యపడి పోతూ, నావైపు తిరిగి, 'చూశారా!' అన్నట్లు చూసింది....

'అన్నట్లు వోట్ల ఫలితాలు ఈరోజే తెలుస్తాయిటగా? వూరంతా అల్లకల్లోలంగా వుంటుందట్నే, సాయంకాలం ఎవరూ బయటికి వెళ్ళగూడ దంటున్నారు.'

'అవునట, వంటవాడు చెప్తున్నాడు .... కలకత్తాలో జరిగినట్టు గొడవలు జరుగుతా' యంటున్నాడు.... ఈరోజు ఎవరూ బయటికి పోకూడదట....అంటూ నా వైపు తిరిగి, 'ఏమే అబ్బాయితో చెప్పావా? యీరోజు సినీమాకీ గినిమాకీ పోవద్దని....'

'కాని వాళ్ళు వినరు-రోజంతా యింట్లో కూర్చుంటే 'బోర్' కొడుతుందని బయల్దేరొచ్చు సాయంకాలం.... చెప్పలేం!—'

'ఏమిటి బోరా! మాట మాట్లాడితే ఈకాలం పిల్లల కిదో మాటొచ్చింది....ఉండు నే చెప్తాలే వాళ్ళకి....ఎక్కడికీ బయల్దేరకుండా నేనే లంకిణిలా వాకిట్లో కూర్చుంటా అంతే-' అని మా అత్తగా రంటూంటే-

'మీ చాదస్తంకానీ ఈకాల పిల్లల్ని పట్టుకోడం కష్టం అండీ'....అని శాంతమ్మ అంటూంటే, అప్పుడే పాలు పిండి పనివాడు మీనాక్షినీ దాని దూడ లక్ష్మినీ తీసుకొచ్చి మా ముందున్న లాన్‌లో గడ్డిమేయడానికి కట్టేసి వెళ్లాడు - వాటిని చూసి శాంతమ్మ మా అత్తగారి వోటువిషయం చివరి సారిగా బయటికి లాగడానికి ప్రయత్నించారు....

'నాకు మీ ఆవూ దూడానూ చూస్తుంటే వోటు కాగితం మీద ఆవూ దూడా గుర్తుకొస్తోంది....చక్కగా పశులక్ష్మి.... మీకు నచ్చలేదండీ, ఆవూ దూడా బొమ్మ?'....అన్నది మా అత్తగార్ని చూసి....

'ఓ బేషుగ్గావుంది బొమ్మ....అయితే మీ రంతా ఆవూ దూడకూ వేశారన్నమాట వోట్లు?....' అన్నారు మా అత్త గారు. శాంతమ్మ వెలవెల బోతూ—

'మీ కెట్లా తెలిసింది, మే మంతా ఆవూ దూడకి వేశామనీ?'.... అన్నది—

'అసలు ఆవూ దూడను చూసి వోటు వెయ్యనివాడు మనిషా! పశువా? చెప్పండి!....'

'అయితే మీరూ ఆవూ దూడకే వేశారన్నమాట!'- అన్నది శాంతమ్మ.

'ఒక్క ఆవూ దూడకే వేస్తే మిగతా వాళ్లేం కావాలా?'

'అంటే?'....అన్నది శాంతమ్మ అర్థంగాక....

'అంటే'-అని ఆమె ఏదో చెప్పబోతుండగా, వెనక వంటింటిదగ్గిర గట్టిగా కేకలూ అరుపులూ, దభా దభీ మని

దెబ్బలూ వినిపించాయి .... అందరం వంటింటివేపు పరుగెత్తాం....

వంటవాడి జుట్టు మా పనివాడిచేతులో వుంది - పనివాడిజుట్టు వంటవాడి చేతులో వుంది-యిద్దరూ మంచి కుస్తీ పట్లలో వున్నారు ..

'ఓరి మీ పార్టీలు దొంగల్దోలా! రోజూ మీ యిద్దరికీ యుద్ధమే! జుట్లు విడపండిరా ముందు. ఎంత అభిమానం వున్నా యిట్లా కొట్టుకుచస్తే ఎట్లా?'....అని మాఅత్తగారు వాళ్ళిద్దర్నీ సమాధాన పర్చ పోయారు....

అబ్బే! ఆమె మాటలు వాళ్ళ చెవులకు వెళ్ళందే! యిద్దరూ పెనుగులాడుతూనే—

"ఏరా! ఏం కూశావ్? .... మా యం. జి. ఆర్. యాక్టర్ కాడా?.... స్టంట్ మాస్టరా?.... ఈ వయసులో యం.జి.ఆర్. చేసే యాక్షన్ మీ శివాజీ చేస్తాడంట్రా?— మా యం.జి.ఆర్. గోటికి సరిపోండ్రా మీ శివాజీ....'

రపీమని అవతలవాడు ఒక టిచ్చాడు, యం.జి.ఆర్. భక్తుడికి....తక్షణం ధడాల్మని ఒకటి అంటించాడు శివాజీ భక్తుడికి ఎం. జి. ఆర్. భక్తుడు. మళ్ళీ యుద్ధం ఆరంభం అయింది .... దాంతో వాగ్యుద్ధం....

'మీ శివాజీ పాత కాంగ్రెస్‌కోసం ప్రచారం చేస్తాడా? మొదటి శివాజీ డి.యం.కె. లో వుండి డి.యం.కె. వాళ్లవల్ల పైకొచ్చాండ్రా సన్నాసీ!....'

'ఏడిశావ్‌లేరా! శివాజీని పైకి ఎవరూ తేనక్కర్లా.... ఆయన గొప్ప యాక్టరు మొదట్నుంచీ....మీ యం.జి.ఆర్.కి యాక్టింగ్ రాదూ, పాడూ రాదూ .... యీ వయసులో

గూడా వయసు పిల్లల్ని హీరోయిన్లుగా వేసుకుని కులుకుతా నంటా డా ముసలాడు.

'ఒరేయ్! నాలిక చీరేస్తాను.... మా యం.జి.ఆర్. యీ జన్మకి ముసలాడుకాడు....అయన డూయెట్ పాడుతుంటే వింటానికి లక్షలాదిజనం పరిగెత్తుతూంటే ఆయన్లో ఎంత ఆకర్షణ వుందో తెలీటంలా?.... దేవుడ్రా! ఆయన్ను రిక్షా వాళ్ళదగ్గిర్నుంచే దేవుళ్ళా చూస్తారు .... ఎలక్షన్లకు ఎంత డబ్బిచ్చాడు! ఎన్ని దానాలు చేశాడు! ఎంతమందికి గుడ్డ లిస్తాడు! మా యం.జి.ఆర్. దానకర్ణుడురా! మీ శివాజీ ఒట్టి పిసినిగొట్టోడ్రా!....'

'నోర్మూయ్! మా శివాజీ ఎలక్షన్లకు డబ్బిచ్చాడ్రా!.... మా శివాజీ అన్నకు పిల్లలున్నారు .... మీ యం.జి.ఆర్. కెవరున్నారురా?....పిల్లల్లేనివాడు దాన ధర్మాలు చెయ్యడం ఏం పెద్దగొప్పరా?.... మా శివాజీ అన్నిట్లోనూ వీరుడురా'—

'ఏడిశావ్! మీ శివాజీ వీరుడు కాదురా! పేడిరా, ఒట్టి పేడి, అడంగి—కట్టబొమ్మన్ పిక్చెర్లో తెల్ల దొర్లు మీ శివాజీని ఉరికంబానికి ఎక్కిస్తె ఆడదానిలా ఏడుస్తూ ఉరితాడు మెడకి తగిలించుకుని చచ్చాడు....అదే మా యం. జి. ఆర్. అన్న అయితేనా! ఆ ఉరితాడుని మెడదాకా రానిస్తాడా....? మధ్యలోనే కత్తితో నరికిపారేయ్యడూ! దెబ్బతో తెల్ల దొర్లందర్నీ చంపేసి తప్పించుకొచ్చేసేవాడు....మా యం. జి.ఆర్. పాదరసంలాగా ఎవరి చేతికీ చిక్కడ్రా!....మా యం.జి,ఆర్. హీరోరా, హీరో!'

'మా శివాజీ హీరోరా....'

'మాటల్లోనేరా హీరో మీ శివాజీ—మా ఎం.జి.ఆర్. చేతల్లోగూడా హీరోరా, గబ్బిలం మొఖం!....'

'నీదే గబ్బిలం మొఖం....'

'మళ్లీ మాట్లాడితే, నీదీ నీ శివాజీదీగూడా సొరకాయ మొఖం.'

'నీదీ, నీ ఎం.జి.ఆర్. దీ గుమ్మడికాయ మొఖం....'

'నీ శివాజీదే గుర్రం మొహం....'

'నీ ఎం.జి.ఆర్. దే ముసలికోతి మొఖం....'

'నీ శివాజీదే గాడిద మొఖం....'

'నీ ఎం.జి.ఆర్. దే బొప్పాకాయ మొఖం.'

'పులుసు మొఖం....'

'కుళ్ళు మొఖం....'

'డోలు మొఖం....'

'కూజా మొఖం....'

'బుంగ మొఖం....'

'గంగిరెద్దు మొఖం ...'

'చచ్చు మొఖం....'

'పుచ్చు మొఖం....'

'ఛీ నోర్ముయ్! పళ్ళు రాలగొట్టేస్తాను....'

'ఏం కూశావ్? నీ పళ్ళు ముందు రాల్తాయిరా'.... అంటూ మళ్లీ యిద్దరూ కలియబడి చచ్చేట్టు కొట్టుకున్నారు. శివాజీ ఫోటో వుండే పత్రిక ఎం.జి.ఆర్. భక్తుడు లాక్కుని కసిగా ముక్కలు ముక్కలుగా చించి అవతల పారేశాడు.... తక్షణం ఎం.జి.ఆర్. ఫోటో వున్న పత్రికని శివాజీ భక్తుడు

లాక్కుని అంతకంటే కసిగా పొడిపొడిగా చించి అవతల పారేశాడు....

ఆ దృశ్యం చూస్తూ నోట మాటలేకుండా దిగ్భ్రమ జెంది నిలబడ్డ మా అత్తగారు ధైర్యంచేసి, మైలపడితే పడ్డాన్లే అని, వాళ్ళిద్దరి మధ్యకు వెళ్ళి వాళ్ళని బలవంతంగా చెరో రెక్కాపట్టి లాగేశారు....

'ఏమిట్రా మీ ఆగడం?....యిదేం యిల్లనుకున్నారా, రోడ్డనుకున్నారా!....మధ్య పాపం ఆ యాక్టర్లిద్దరి బొమ్మలూ అట్లా చించిపారేశారే! మీకేం పోయేకాలంరా!.... వాళ్ళేం చేశారనీ!.... అస లెందుకొచ్చిందీ మీ యిద్దరికీ దెబ్బ లాటా?....'

'మీగురించే పెద్దమ్మగారూ!....'

'మధ్య నాగురించేమిట్రా! నేనేంచేశానూ?....'

అంతలో శివాజీ భక్తు డందుకున్నాడు —

'అదికాదు పెద్దమ్మగారూ! మీరు మీ వోటు మా రాట్నానికే వేస్తానన్నారుగదూ?....'

'అవునూ! వేశానూ!....'

'అదేంటి పెద్దమ్మగారూ? .... మీ రింత దగాచేస్తా రనుకోలేదే! ఎంతో నమ్మకంగా, నాతో మా ఉదయసూర్యుడికి, ఆవూ దూడాకి ఏస్తానని ఆ సూర్యుడి సాక్షిగా మన మీనాక్షి ఆవు సాక్షిగా ప్రమాణంచేసి చెప్తిరే!....'

'అవునూ! చెప్పానూ!.... నేనేం తప్పలేదే!'.... అని ఆమె అంటూంటే వాళ్ళిద్దరితోబాటు మా మొఖాలూ వెలవెల బోయాయి....

'అయితే పెద్దమ్మగారూ! యింతకీ మీ రెవరికేశారు మీ వోటూ?' అన్నారు యిద్దరూ ఏకకంఠంగా.... మా అత్త గారు ప్రసన్నవదనంతో—

'అట్లా అడగండి చెప్తాను. పిచ్చివెధవల్లారా! .... దీనికి పోట్లాటెందుకూ? .... మీకొకటి చెప్పి నే నింకొకటి చేస్తానట్రా? అందులోనూ మాయింట్లో పనిచేస్తున్న మీకు ద్రోహం చేస్తానా?....నీకు చెప్పినట్లు నీ కిష్టమైన రాట్నానికి వేశాను.... నీకు చెప్పినట్లు నా కిష్టమైన ఆవూదూడకూ వేశాను... మనకు ప్రత్యక్షదైవం సూర్యుడుకీ వేశాను.... నేను లోపలికి పోతూంటే, అమ్మా నక్షత్రానికి వెయ్యండి - అది మామూలు నక్షత్రం కాదు ధ్రువనక్షత్రం....అన్నాడు ఒక ముసలి ఆచార్లు. అందుకని చివర్లో ఆ నక్షత్రం మీద కూడా వో ముద్ర పడేసి చక్కా వచ్చాను'....అని ఆమె చెప్తూంటే 'హరో హరి, గోవిందా గోవింద!....మీ వోటు నేరుగా నక్షత్రాలకే పోయింది....' అన్నారు వాళ్ళిద్దరూ.... శాంతమ్మా నేనూ నవ్వు ఆపుకోలేక చచ్చాం....

'మీకు నెలరోజులుగా చెప్పిందంతా బూడిద చేశారు పెద్దమ్మగారూ!'

'ఏమిట్రా! ఏంచేశానూ?'—

'మీ వోటు చెల్లదమ్మా!'....

'ఎందుకనిరా?....'

'అన్ని బొమ్మలమీద ముద్దర్లు కొడితే చెల్లదు తల్లీ'....

'ఏడిశారు! ఎందుకు చెల్లదురా? - ఎవరి కిష్టమైన బొమ్మలమీద వాళ్ళు ముద్రలు వేయడానికేగా అన్ని బొమ్మలు వేశారూ!....'

'అది సరేనమ్మా!....రెండు కాగితా ల్లోనూ, ఒక్కో దాంట్లో ఏదో ఒకబొమ్మమీదే వేయాలి....

'ఆ సంగతి నాకేం తెలుసూ? - మరి రెండు కాగితా ల్లోనూ ఏవో రెండుబొమ్మలువేసి ఆఘోరించగూడదూ? - చిన్నపిల్లల రెండోక్లాసు పుస్తకంలోలా అన్ని బొమ్మలు వేస్తే ఎవరికైనా తలకాయ చెడిపోదూ?....పైగా మొదటి సారి వోటు వెయ్యడానికి వెళ్తినీ - అదీ మీ రిద్దరూ నా ప్రాణాలు తోడేస్తేనే మీ కోసం వెళ్ళాను....అయినాఆ బొమ్మ లన్నీ ఏమిట్రా?....

'అవన్నీ ఒక్కో బొమ్మ ఒక్కోపార్టీ అండీ!'

'మరి అన్నిటికీ వేస్తే అన్నిపార్టీలూ రాజ్యానికి రావాలె గాదటమ్మా!....'

'అది కాదండీ! ఎక్కువవోట్లు పడ్డదే రాజ్యం చేసే పార్టీగా వస్తుంది....'

'ఏం ఎత్తు భారమో! నాకేం తెలుసు ముసల్దాన్ని!.. యింతకీ ఎవరొచ్చారు? వీళ్ళిట్లా కొట్టుకు చస్తున్నారు!....'

'యింకా తెలిలా ఈ రోజే తెలుస్తాయి ఫలితాలు. అదుగో రేడియోలో వార్తలు వినబడుతున్నాయే!' - అని శాంతమ్మంటూంటే పరుగెత్తారు, వంటవాడూ పనివాడూ రేడియో దగ్గిరికి....

కాసేపటికి ఎం. జి. ఆర్. భక్తుడు 'వెట్రీ! వెట్రీ! జయం మాదే! జయం మాదే! - మా డి. ఎం. కె. గెలి

చింది - మా ఎం. జి. ఆర్. గెల్చాడు ....అంటూ ఒళ్ళు తెలీని ఆనందంతో పరుగెత్తు కొచ్చాడు.

'అంటే అదేం బొమ్మరా?' - అన్నారు మా అత్త గారు....

'సూర్యుడమ్మా! ఉదయ సూర్యుడు' -

'మరి నే దానిమీదే వేశాను గదరా ముద్దర?'....

'మీ వోటు శంకరగిరి మాన్యాలు పట్టి పోయిం దమ్మా! మీది చెల్లని వోట్లలో పడిపోయింది'.... అంటూ గబ గబ వెళ్ళి శివాజీ భక్తుడి చెవు పట్టుకు లాక్కొచ్చాడు మా ముందుకి....

'చూడండమ్మా!....వీడు నాతో 'బెట్టు' కట్టాడు....డి. ఎం. కె. వోడితే నేనుపది రూపాయలు వీడికిచ్చేట్లు....నిజలిం గప్ప కాంగ్రెస్ వోడితే వీడు యిరవై రూపాయలు నాకి చ్చేట్టూ....యింకా కానీరా, వోట్లు లెక్కపెట్టనీ! - యింకా వున్నాయిగా! - యింతవరకూ డి. ఎం. కె. లీడింగ్‌రా!.... కక్కు ఇరవై రూపాయలు! ఊఁ! కక్కు!' -

'రేపిస్తా, యిప్పుడు నాదగ్గిర్లేదు'....

'చూడండమ్మగారూ! మీరే సాక్ష్యం!'....అని మా అత్తగారి దగ్గిరి కెళ్లాడు....

'ఆఁ, నాకేం తెలీదు పోంద్రా!....మీ కోసం వెళ్ళి అన్యాయంగా చెల్లని వో తేసొచ్చాను....వెధవపీడా - వెళ్ళ కున్నా బాగుండేది!....అప్రతిష్ఠ....యింతకీ తెలీకడుగుతా, మరి యీ ఎలక్షన్లెందుకూ? రెండేళ్ళుగా మనకు డి. ఎం. కె. ప్రభుత్వమేగా వున్నదీ? మళ్ళీ అదే ఒచ్చిందని ఎగుర్తా రేమట్రా?....వున్నదే రావడ మేమిటీ?'....

'అబ్బో, పెద్దమ్మగారోయ్! మీకు చెప్పేసరికి నా బుర్ర పోద్ది. నేపోతున్నా....చిన్నమ్మగార్ని అడగండి చెప్తారు'....అంటూ పనివాడు వెళ్ళి పోయాడు....

'ఏమిటో! యీ వాళ్లేమిటో, యీ రాజ్యాలేమిటో నాకేం బోధపట్టంలా....బ్రంహ్మంగారు వ్రాసినట్లు ఆ వీరభోగ వసంతరాయుడు పుట్టాలే—యీ ప్రపంచాన్ని ఉద్ధరించాలే అంతే....అందాకా యీ అల్లకల్లోలాలూ, కాల్చుకోడాలూ ఇంతే....ఏమంటావు శాంతమ్మా?'....అన్నారు మా అత్త గారు.

'అంతేనండీ, అంతే!....'అన్నది శాంతమ్మ యింత కంటే ఆమె కేం సమాధానం చెప్తాం అన్నట్లు నాకేసి చూస్తూ.

---